క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల పంపిణీ


పంచాయతీ కార్మికులకు దుస్తులను అందజేస్తున్న కాళీదాసన్

మనోహరాబాద్(తూప్రాన్): దసరా సందర్భంగా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని కాళ్లకల్‌లో మాజీ ఉప సర్పంచ్ కాళీదాసన్, మాజీ వార్డు సభ్యులు ప్రభాకర్‌గౌడ్, జీడిపల్లిలో నాయకులు మల్లేశ్ సొంతంగా పంచాయతీ సిబ్బంది, కార్మికులకు నూతన వస్త్రాలతో పాటు బూట్లను అందజేశారు.

దుర్గాదేవి చిత్రం గీసిన ఉపాధ్యాయుడు


అమ్మవారి రూపం

మనోహరాబాద్(తూప్రాన్): విజయదశమిని పురస్కరించుకుని శక్తి స్వరూపిణి దుర్గాదేవి అమ్మవారి చిత్రాన్ని మనోహరాబాద్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు బ్రహ్మచారి బుధవారం చిత్రించాడు. అమ్మవారి చిత్రం చూపరులను ఆకట్టుకుంది.

బాల్య వివాహాలు అరికట్టడమే లక్ష్యం

విజన్ సంస్థ డైరెక్టర్ వంగరి కైలాస్


మాట్లాడుతున్న కైలాస్

మెదక్‌కలెక్టరేట్: బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విజన్ సంస్థ డైరెక్టర్ వంగరి కైలాస్ తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని బాలల సంరక్షణ కేంద్రంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయన్నారు. బాలికల్లో 69 శాతం, బాలురల్లో 72 శాతం తగ్గినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు లక్ష్యం చేరుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు



చిన్నశంకరంపేట(మెదక్): మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టి లక్ష్యం చేరుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాయలంలో సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల రుణాలను ఇప్పటి వరకు 62 శాతం అందించగలిగామన్నారు. త్వరలోనే పూర్తి లక్ష్యం చేరుకుని ఆ సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రాములు, సీసీలు యశోద పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... అనంతసాగర్ గ్రామానికి చెందిన మ్యాకల రమేశ్ తన కుమారుడి శివతో కలిసి చేగుంట నుంచి బైకుపై ఇంటికి వస్తున్నారు. బోనాల్ వైపు నుంచి చేగుంటకు వస్తున్న కారు బైకును ఢీకొట్టడంతో రమేశ్ కాలికి, శివ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రమేశ్‌ను చేగుంట ప్రైవేటు ఆస్పత్రికి, శివను సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సేవకులు

పాపన్నపేట(మెదక్): ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ తోట రవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో భారీ ర్యాలీ అనంతరం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేశ సేవలో స్వయం సేవకుల పాత్ర ఎనలేనిదన్నారు. ఖండ వ్యవస్థాపక్ ప్రముఖ్ బోలాశేఖర్, జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖ్ క్రిష్ణారెడ్డి, గ్రామశాఖ ముఖ్య శిక్షక్ దుర్గాప్రసాద్, ధ్వజ ప్రముఖ్ అజయ్, ఇతర స్వయం సేవకులు ,యువకులు పాల్గొన్నారు.


కాడిపల్లిలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు


శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో సద్దుల బతుకమ్మ సంబురాలు

సద్దుల బతుకమ్మ సందడి

గ్రామాలు, పట్టణాలలో బతుకమ్మ వేడుకల సందడి కొనసాగుతోంది. బుధవారం సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో భారీ బతుకమ్మలను అందంగా పేర్చారు. ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఉత్సాహంగా బతుకమ్మ ఆడి సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.


కొల్చారం(నర్సాపూర్): బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వెల్దుర్తి(తూప్రాన్): హస్తాల్‌పూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


శివ్వంపేట(నర్సాపూర్): గుండ్లపల్లిలో..


నర్సాపూర్‌రూరల్: తుజాల్‌పూర్‌లో..


కొడిపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ..


మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో..


చేగుంట(తూప్రాన్): కర్నాల్‌పల్లిలో..


చేగుంట హనుమాన్ దేవాలయం వద్ద..


చేగుంట సీఎంఆర్ కాలనీలో..


తూప్రాన్‌లో పెద్ద చెరువు కట్ట వద్ద..


నిజాంపేటలో ఏడో వార్డులో..


నిజాంపేటలో..


చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల పరిధి శేరిపల్లిలో..

శక్తి స్వరూపిణి.. మహిషాసురమర్దిని

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అన్ని గ్రామాలు, పట్టణాలలో ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు బుధవారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాలు, ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలు చేశారు.


నర్సాపూర్: దుర్గామాతకు పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర నేత మురళీయాదవ్


శివ్వంపేట(నర్సాపూర్): దొంతిలో..


కొడిపల్లి: కొడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో


నర్సాపూర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో..


చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో..


టేక్మాల్‌లో పూజలు చేస్తున్న భక్తులు


పెద్దశంకరంపేట(మెదక్): రామోజిపల్లిలో..


రేగోడ్: దుర్గమ్మ కాలనీలో..


రామాయంపేట: పల్లకీలో దుర్గామాత..

సుఖసంతోషాలతో ఉండాలి


కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: జిల్లా ప్రజలంతా నేడు దసరా పండగను సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సిరిసంపదలతో తులతూగాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి


ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఆ జగన్మాత ఆశీస్సులతో అందరు సిరిసంపదలతో తులతూగాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే దసరా పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలన్నారు.

కొత్త వెలుగులు నింపాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి


పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో విజయ దశమి పండుగ జరుపుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. దసరా ప్రజల జీవితాలలో కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. దుర్గమ్మ దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

నేడు ఘనంగా దసరా ఉత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం మెదక్‌లో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. టపాసులతో భారీ రావణుడి దిష్టిబొమ్మ ఏర్పాటు చేసి రావణ దహనం చేస్తారు. ఈ ఉత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, పట్టణ ప్రముఖులు హాజరవుతారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షిస్తారు.

గుండెపోటుతో యువ క్రికెటర్ మృతి

మెదక్‌మున్సిపాలిటీ: గుండె పోటుతో యువ క్రికెటర్ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. నవాబుపేట వీధికి చెందిన జలాల్‌పురం సాయికిశోర్(28) బుధవారం ఉదయం గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికిశోర్ జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో పాల్గొని ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబర్చాడు. ఆయనకు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో తండ్రి చనిపోగా ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న సాయికిశోర్ కూడా మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారిని కలిచివేశాయి.

12 మంది నోడల్ అధికారుల నియామకం

మెదక్‌కలెక్టరేట్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగనున్న స్థానిక ఎన్నికల నిర్వహణకు 12 మంది నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోఆర్డినేటర్ డీఈఓ రాధాకిషన్, బ్యాలెట్ బ్యాక్స్ పర్యవేక్షణ అధికారిగా పీఆర్‌ఈఈ నర్సింహులు, రవాణా కార్యక్రమ అధికారిగా డీటీఓ వెంకటస్వామి, శిక్షణ అధికారిగా తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఎన్నికల సామగ్రి పర్యవేక్షణ అధికారిగా జెడ్పీసీఈఓ ఎల్లయ్య, ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా డీఆర్ఓ భుజంగరావు, ఎన్నికల వ్యయపరిశీలకులుగా ఆడిట్ అధికారి రాకేశ్, అబ్జర్వర్‌గా డీసీఎస్ఓ నిత్యానందం, బ్యాలెట్ పేపర్ పర్యవేక్షణ అధికారిగా డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, మీడియా కమ్యూనికేషన్ అధికారిగా డీపీఆర్ఓ రామచంద్రరాజు, హెల్ప్‌లైన్, గ్రీవెన్ సెల్ అధికారిగా జిల్లా అగ్రికల్చర్ అధికారి దేవ్‌కుమార్, రిటర్నింగ్ అధికారిగా డీపీఓ యాదయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పెరిగిన భూగర్భ జలాలు


చేతి పంపు నుంచి ఉబికి వస్తున్న నీరు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో వానలు దంచి కొట్టాయి. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండి అలుగు పారుతున్నాయి.
భూగర్భ జలాలు ఘణనీయంగా పెరిగాయి. జూన్ నుంచి సెప్టెంబర్ చివరి వరకు 641.6 మిల్లీ మీటర్ల వర్షం కురవగా 875.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అంటే కురవాల్సిన దాని కంటే 233.6 మిల్లీ మీటర్ల వర్షం అధికంగా కురిసింది. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు, చేతి పంపుల నుంచి నీరు దానంత అదే పైకి ఉబిగి వస్తుంది. నీరు పైకిఉబికి వస్తుండటంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

రిటైర్డ్ వైస్ ఛాన్సలర్లకు సన్మానం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అనుభవ మండపంలో బుధవారం ఇద్దరు రిటైర్డ్ వైస్ ఛాన్సలర్స్‌ను లింగాయత్ సమాజ్ నాయకులు సన్మానించారు. శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ తిరుపతి రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయరాంరెడ్డి, తెలంగాణ యూనివర్శిటీ రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్‌ల తండెడి కిషన్‌రావులు బసవాది జీవన విధానం గురించి తెలుసుకోడానికి వీరు కర్నాటకలోని బసవకళ్యాణ్‌కు వెళ్తున్నారు. ఈ సందర్భంగా అనుభవ మండపాన్ని సందర్శించిన వీరిని లింగాయత్ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, ఆర్.సుభాష్ తదితరులు సన్మానించారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

సంగారెడ్డి క్రైమ్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం విక్రయాలు చేయొద్దని బుధవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాల యజమానులకు మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి నోటీసులు అందజేశారు. డ్రైడే తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి పురస్కరించుకొని టౌన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణలో విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. అమ్మవారి కరుణ, కటాక్షలు పోలీసులపై ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు.

మాంసం దుకాణాల వద్ద సందడి


మాంసం దుకాణాల వద్ద సందడి

వెల్దుర్తి(తూప్రాన్): దసరా పర్వదినాన గాంధీ జయంతి ఉండటంతో గురువారం మద్యం, మాంసం దుకాణాలు మూసి ఉంటాయి. దీంతో మండల కేంద్రం వెల్దుర్తిలో బుధవారం సాయంత్రం నుంచే మాంసం కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద సందడి నెలకొంది. వెల్దుర్తితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు కొనుగోలు చేయడానికి అధికసంఖ్యలో రావడంతో ప్రధాన రహదారి కొనుగోలుదారులతో నిండిపోయింది.

విక్రయదారులకు మున్సిపల్ నోటీసులు

రామాయంపేట(మెదక్): విజయదశమి, గాంధీ జయంతి ఒకే రోజు వస్తుండటంతో అక్టోబర్ 2న మటన్, చికెన్ అమ్మితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ హెచ్చరించారు. ఈ మేరకు దుకాణదారులకు మున్సిపల్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు.

చెడుపై మంచి సాధించిన విజయమే దసరా

ఎస్పీ శ్రీనివాసరావు


ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, అమ్మవారు ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఆయుధ, వాహన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలను దైవస్వరూపంగా భావించి ఈ పూజలు చేశామన్నారు. ఈ పూజలు సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపుతాయని, విధి నిర్వహణలో మరింత అంకితభావంతో పనిచేయడానికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. జిల్లా ప్రజలకు ఆయన విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రూప్–1 డీఎస్పీ ఉద్యోగం సాధించిన శైలేష్, ప్రభాత్‌రెడ్డి, ప్రణయ్‌సాయిని అభినందించారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, అందువల్ల ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించ వద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ

చిలప్‌చెడ్(నర్సాపూర్): అకాల వర్షాలు, సింగూర్ నీటి విడుదల కారణంగా నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురిసిన భారీ వర్షాలకు, సింగూర్ ప్రాజెక్ట్ నీటి విడుదల కారణంగా మండలంలో అనేక ఎకరాల్లో పంటలు మునిగిపోయాయన్నారు. నష్టపోయిన పంట వివరాలు అంచనా వేయాల్సిన అధికారులు, అటు వైపు చూడకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా పంట నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కడారి నాగరాజు, ఏరియా కమిటీ సభ్యుడు మల్లేశం, నాయకులు శేఖర్, పోచయ్య, మొగులయ్య పాల్గొన్నారు.